సాక్షి
వరంగల్
సోమవారం । 13 । మార్చి । 2023



పుచ్చకు 'పురుగు'ల బెడద

ఎంతో ఆశతో సాగు చేస్తున్న పుచ్చపంటకు పురుగుల బెడద పీడిస్తోంది. కాపు దశకు వచ్చిన సమయంలో వివిధ రకాల పురుగులు ఆశించడంతో దిగుబడి తగ్గుతోంది. - 8లో▸



టైర్లను దొంగిలిస్తున్న ముఠా అరెస్ట్

రాత్రి సమయంలో జాతీయ రహదారిపై పార్క్ చేసిన లారీలు, టిప్పర్ల టైర్లను దొంగిలిస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$38^0/20^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ముగిసిన అథ్లెటిక్స్ ఎంపికలు



వరంగల్ స్పోర్ట్స్: అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన హనుమకొండ, వరంగల్ జిల్లాల మహిళల అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఎంపికల ప్రక్రియ 10 గంటల వరకు ముగిసినట్లు నిర్వాహకుడు సారంగపాణి తెలిపారు. 100, 200, 400, 800, 1500, 3000 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో విభాగాల్లో రెండు జిల్లాల నుంచి 60 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు 19న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి మొదటి మహిళా అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఎంపిక పోటీల్లో కోచ్ శ్రీమన్నారాయణ, పీఈటీ సాంబమూర్తి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల అక్రమ దత్తతపై ఫిర్యాదు

కాశిబుగ్గ సెంటర్: జిల్లాలో పసిపిల్లలను చట్ట విరుద్ధంగా అక్రమంగా దత్తత చేసుకున్నారనే ఆరోపణలు, తల్లిదండ్రులు కోల్పోయిన పిల్లలకు సంబంధించిన వారి డబ్బులను అధికారులు స్వాహా చేశారనే ఆరోపణపై రాష్ట్ర బాలల హక్కుల కమిషనర్‌కు డీసీపీఓ జి.మహేందర్‌రెడ్డి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పిల్లల దత్తత చట్టాలకు వ్యతిరేకంగా చేసుకున్నారనే ఆరోపణలు, కార్యాలయంలో రహస్యంగా ఉండాల్సిన రికార్డులు బయటకు వెళ్లడం, తదితర అంశాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్య తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే ఈ విషయంపై జనవరి నెలలోనే బాలల కమిషన్‌కు ఫిర్యాదు చేసినా..ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. దీంతో మళ్లీ శనివారం కమిషన్‌కి ఫిర్యాదు చేయడం జరిగిందని డీసీపీఓ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పునఃప్రతిష్ఠాపనోత్సవాలు



రాయపర్తి: మండలంలోని కొండూరు గ్రామంలో నిర్వహిస్తున్న చారిత్రక శ్రీ సిద్ధేశ్వర ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధేశ్వర స్వామి ధ్వజస్తంభ, బంగారు మైసమ్మ, జంట నాగులు, కుంభాభిషేక, రజతోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు నీళ్ల బిందెలతో ధ్వజ స్తంభంపై పోస్తూ పూజలు నిర్వహించారు. దీంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా బిల్లా సుధీర్‌రెడ్డి ఆలయ అభివృద్ధికి రూ.50,116లను విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్ర సరితరవీందర్‌రెడ్డి, వీరమనేని సత్యనారాయణరావు, కరిమిళ్ల సోమేశ్వర్‌రావు, పులి సోమయ్య, వల్లపు వెంకన్న, నేరెళ్లి రాములు, ఆవుల కేశవరెడ్డి, శ్యామ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరాలయంలో పూజలు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామిని కరీంనగర్ సీపీ ఎల్.సుబ్బారాయుడు కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆయన ఆలయ రాజగోపురం వద్దకు రాగా ఆలయ వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి గర్భగుడిలో విశేష పూజలు చేశారు. శ్రీశుభానందదేవి అమ్మవారికి పూజలు నిర్వహించారు. అక్కడ వారి ఆలయ అర్చకుడు ప్రశాంత్‌శర్మ శాలువాతో సన్మానించి తీర్థప్రసాదం అందజేశారు. ఆయనవెంట మహదేవపూర్ సీఐ కిరణ్, కాళేశ్వరం, కోటపల్లి ఎస్సైలు లక్ష్మణ్‌రావు, వెంకటస్వామి ఉన్నారు.

కోటంచకు భక్తుల తాకిడి

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని కోటంచ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 2నుంచి 9వరకు కొనసాగిన బ్రహ్మోత్సవాల అనంతరం ఆదివారం కోటంచ ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చనలు చేశారు. బ్రహ్మోత్సవాల అనంతరం ఆదివారం సెలవు రోజు కావడంతో ఎక్కువ మంది భక్తులు ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించారు. చిన్న పిల్లలు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన బొమ్మల దుకాణంలో బొమ్మలను కొని ఆనందంగా గడిపారు. బ్రహ్మోత్సవాల అనంతరం ఆలయానికి భక్తుల తాకిడి ఇదే ప్రథమం అని ఆలయ సిబ్బంది తెలిపారు.

తీరనున్న పోడు..గోడు

- హక్కు పత్రాల పంపిణీకి సిద్ధం చేస్తున్న అధికారులు
- జిల్లాలో 7,711 దరఖాస్తులు
- మొదట గిరిజనులకు పంపిణీ చేయడానికి సమాయత్తం



కొండాపురం శివారులో పోడు భూములను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

నర్సంపేట: జిల్లాలో పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు అందించడానికి ప్రభుత్వం సిద్ధమవుతుంది. మార్చి నెలాఖరు నాటికి పంపిణీ చేసేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 15,482 మంది రైతులకు 1,77,809 ఎకరాల విస్తీర్ణంలో పోడు పట్టాల పంపిణీ కోసం సాంకేతిక పరిజ్ఞానంతో సర్వే జాబితాను పూర్తి చేయగా ఇందులో జిల్లాలో 3,800 మందికి అందించనున్నారు. తొలుత గిరిజనులకు పట్టాలు పంపిణీ చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను ముమ్మరం చేశారు. అటవీ హక్కుల చట్టం కింద వచ్చిన దరఖాస్తులను జిల్లా కమిటీ క్షుణ్ణంగా పరిశీలిస్తుంది.

7,711 దరఖాస్తులు..

జిల్లాలోని పలు మండలాల పరిధిలో 7,711 పోడు దరఖాస్తులు వచ్చాయి. పోడు సాగు చేసుకుంటున్న రైతులకు హక్కులు కల్పించడానికి అధికార యంత్రాంగం ఏర్పాట్లను చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన సమయాన్ని బట్టి పంపిణీకి సిద్ధమవుతున్నారు. అనేక సంవత్సరాల నుంచి రైతులు పోడు భూముల సాగు చేసుకుంటున్నారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఉన్న సమయంలో పోడు రైతులకు హక్కు పత్రాలు కల్పించి బాసటగా నిలిచారు. ఆ తర్వాత పోడు రైతులకు హక్కు పత్రాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతూ సాగు చేసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వ హయాంలో హక్కు పత్రాల కోసం పోడు రైతులు ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో 2005 డిసెంబర్ 13లోపు పోడు సాగు చేసుకున్న వారికి హక్కు పత్రాలు ఇవ్వడానికి ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించింది. ఈ క్రమంలో వచ్చిన దరఖాస్తులన్నింటిని సర్వే పూర్తి చేయించారు. గ్రామస్థాయి, సబ్ డివిజనల్ స్థాయి కమిటీల నుంచి జిల్లా స్థాయి కమిటీ వద్దకు వెళ్లాయి. జిల్లా స్థాయి కమిటీ ఆధ్వర్యంలో దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఇందులో మొదటగా జిల్లాలో 3,800 మంది గిరిజనులకు హక్కు పత్రాలను పంపిణీ చేయడానికి సమాయత్తం అవుతున్నారు.



సర్వేను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి (ఫైల్)

గిరిజనేతరులకు ఎప్పుడో..

దరఖాస్తుల స్వీకరణ క్రమంలో గిరిజనులు, గిరిజనేతరుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులన్నింటికి అధికారులు ప్రత్యేకంగా రూపొందించిన యాప్ ద్వారా సర్వేలు పూర్తి చేశారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నప్పటికి మొదటగా గిరిజనులకు మాత్రమే హక్కు పత్రాలను పంపిణీ చేస్తారనే విషయం తెలుస్తుండడంతో గిరిజనేతర రైతులు ఆందోళనకు గురవుతున్నారు. గిరిజన రైతులతో పాటు గిరజనేతరులకు సైతం ఒకేసారి హక్కు పత్రాలు పంపిణీ చేస్తే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పట్టాల కోసం ఎదురు చూస్తున్నాం..



ఏడు ఎకరాల పోడు వ్యవసాయ భూమిని సాగు చేసుకుంటున్నా. పట్టాలు ఇస్తామనడంతో దరఖాస్తు చేసుకోగా రెండు ఎకరాలకు సర్వే చేశారు. సుమారు మూడు నెలలు అవుతుంది. నాతో పాటు మా తండాలో చాలా మంది రైతులు పట్టాల కోసం ఎదురు చూస్తున్నారు. **-ఈర్య, చిలుకమ్మతండా**

తాతల కాలం నుంచి పోడు చేస్తున్నాం..



తాతల కాలం నుంచి పోడు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాం. నాకున్న మూడు ఎకరాల పోడు భూమి హక్కుల పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న. ఇప్పటి వరకు హక్కు పత్రాలు ఇవ్వలేదు.

-కళ్లి పెద్ద లక్ష్మయ్య, కొండాపురం

పట్టాలు ఇస్తామంటే సంబుర పడ్డాం..



గిరిజనేతరులకు తెలంగాణ ప్రభుత్వం పట్టాలు ఇస్తామంటే సంబురపడ్డాం. అధికారులు సర్వే చేసినా.. పట్టాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారు. వెంటనే దరఖాస్తులను పరిశీలించి హక్కు పత్రాలు అందించాలి.

-మేకల ధనలక్ష్మి, కొండాపురం

పర్వతగిరిలో ఇంటర్ కళాశాల

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



మంత్రిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

వరంగల్ (పర్వతగిరి) : ఆరు నెలల్లోపు పర్వతగిరిలో ఇంటర్ కళాశాల ఏర్పాటు చేస్తానని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రంలో ఆదివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1987–88 పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై వారిని ఉద్దేశించి మాట్లాడారు. తాను చదివిన పాఠశాలలో పూర్వ విద్యార్థులు పెద్ద ఎత్తున సమ్మేళనాలను ఏర్పాటు చేయడం గర్వకారణమన్నారు. పూర్వ విద్యార్థులు కోరిక మేరకు ఆరు నెలల్లో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా పర్వతగిరిలో ఇంటర్ కళాశాల ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పూర్వ విద్యార్థులు మంత్రి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పట్టాపురం ఏకాంతంగౌడ్, తహసీల్దార్ అనుపమ, పరమేశ్వర్ రావు, డీఈ చక్రునాయక్, ఎంపీడీఓ జయరామ్, మధుపాల్‌రావు, పీఈటీ రఘువీర్, పి.శ్రీధర్, అడ్వకేట్ యాకాంబ్రం, సత్యనారాయణ, తక్కళ్లపల్లి కొమురయ్య, మంచాల మధు, తదితరులు పాల్గొన్నారు.

ధర్మారంలో రెసిడెన్షియల్ పాఠశాల నిర్మిస్తాం

- పూర్వ విద్యార్థులు ఒకే చోట కలుసుకోవడం విశేషం
- ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి
- ముగిసిన వజ్రోత్సవ వేడుకలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

గీసుకొండ: ధర్మారంలో రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పాటు చేసి విద్యాభివృద్ధికి తోడ్పాటునందిస్తామని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. ఆదివారం గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారం జెడ్పీ ఉన్నత పాఠశాల వజ్రోత్సవ వేడుకల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ధర్మారం జెడ్పీ పాఠశాలలో 75 సంవత్సరాల నుంచి చదివిన బ్యాచ్‌ల విద్యార్థులు వజ్రోత్సవ వేడుకల ద్వారా ఒకే చోట కలుసుకోవడం గొప్ప విషయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి అర్హత, శిక్షణ ఉన్న ఉపాధ్యాయులు బోధిస్తుండటంతో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ధర్మారం బడి నాణ్యమైన విద్యను అందించడంలో జిల్లాలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి పాటు పడాలన్నారు. పాఠశాల రిటైర్డ్ హెచ్‌ఎం నర్సింహారెడ్డి 25 సంవత్సరాల పాటు ఇక్కడే సేవలందించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా రిటైర్డ్ హెచ్‌ఎం నర్సింహారెడ్డిని ఆయన ఘనంగా సన్మానించారు. కాగా ఈ వజ్రోత్సవాలు సుమారు 4వేల మంది పూర్వ విద్యార్థులు హాజరు కావడం విశేషం. ఈ కార్యక్రమంలో అల్యూమిని కమిటీ చైర్మన్ గాదె దయాకర్, హెచ్‌ఎం సుజాత, సీఐ సట్ల రాజు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ రామా సంతోష్, కార్పొరేటర్లు సుంకరి మనీషా శివకుమార్, గద్దె బాబు, మార్కెట్ డైరెక్టర్ గోలి రాజయ్య, కొమ్మాల బాబు, కొట్టి ముత్తిలింగం, గట్టి కొప్పుల రాంబాబు, రామా వెంకటనారాయణ, పార్వతి నర్సింహస్వామి, సుజాత, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓల కొరత!

- జిల్లాలో మండల విద్యాశాఖ అధికారుల కరువు
- సీనియర్ హెచ్‌ఎంలకు అదనపు బాధ్యతలు
- మానసిక ఒత్తిడికి గురవుతున్నామంటూ ఆవేదన

కాశిబుగ్గ సెంటర్: కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ విద్యావ్యవస్థలో మార్పుతేవాలని ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్తున్న మాటలకు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. జిల్లాల విభజన తర్వాత నుంచి నేటి వరకు జిల్లాలో పూర్తిస్థాయి మండల విద్యాశాఖ అధికారులు (ఎంఈఓ) లేరు. జిల్లాలో మొత్తం 724 పాఠశాలలు ఉండగా ఇందులో ప్రాథమిక పాఠశాలలు 478, ఉన్నత పాఠశాలలు 86, జెడ్పీహెచ్‌ఎస్ 160 పాఠశాలలున్నాయి. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్యాలయాలను తీర్చిదిద్దేందుకు ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలలో 1 నుంచి 8వ తరగత వరకు ఇంగ్లిష్ మీడియం ప్రారంభించారు. అయితే పాఠశాలల్లో ఉపాధ్యాయులు, నాల్గో తరగతి సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది లేకపోవడంతో పాలన పరంగా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. చాలా పాఠశాలల్లో డిప్యూటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక జిల్లాలోని 13 మండలాల్లో ఏ ఒక్క మండలానికి కూడా ఎంఈఓ లేరు. దీంతో సీనియర్ హెచ్‌ఎంలకు ఒక్కరికి నాలుగేసి మండలాల చొప్పున ఎంఈఓలుగా అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో మానసిక ఒత్తిడికి గురవుతున్నామని, విధిలేని పరిస్థితిల్లో పనిచేయాల్సి వస్తుందని పేరు చెప్పడానికి ముందుకు రాని ఓ ఎంఈఓ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోని సెక్టోరియల్ అధికారుల పరిస్థితి కూడా ఇలానే ఉంది. ఇప్పటికైన పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు ఖాళీగా ఉన్న సబ్జెక్టు టీచర్లను, ఇతర సిబ్బంది నియమిస్తే ఆశించిన మేరకు ఫలితాలు సాధించవచ్చని ఉపాధ్యాయులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నవాళ్లతోనే సర్దుకుపోతున్నాం..



జిల్లాలో విద్యాశాఖలో రెగ్యూలర్ ఎంఈఓలు లేరు. ఉన్న వాళ్లతోనే సర్దుకు పోతున్నాం. 13 మండలాలకు ఒక్క ఎంఈఓ కూడా లేని మాట వాస్తవమే. సీనియర్ హెచ్‌ఎంలకు ఎఈఓ బాధ్యతలు అప్పగించాం. ప్రభుత్వ నిర్ణయం మేరకు పనిచేస్తున్నాం.

-డి.వాసంతి, డీఈఓ

నయాదందా!

- ఉచిత సేవలకు డబ్బులు వసూలు చేస్తున్న అక్రమార్కులు
- ప్రజాప్రతినిధులతో చేతులు కలిపి గ్రామాల్లో క్యాంపుల ఏర్పాటు
- ఏబీహెచ్ కార్డుల నమోదుకు రూ.50 నుంచి రూ.100 వసూలు చేస్తున్న వైనం

జిల్లాలో తెల్లరేషన్ కార్డులు	2,66,749
ఇప్పటివరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారు	62,161

సంగెం: ఉచిత సేవలకు డబ్బులు వసూళ్లు చేస్తూ గ్రామాల్లో నయాదందాకు తెర తీశారు కొందరు అక్రమార్కులు. జాతీయ ఆరోగ్య బీమా పథకం ఆయుష్మాన్ భారత్ హెల్త్ (ఏబీహెచ్) కార్డుల కోసం ఆన్‌లైన్‌లో ఉచితంగా దరఖాస్తులు నమోదు చేసేందుకు ఆరోగ్యశ్రీ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, గ్రామాల్లోని సీఎస్‌సీ సెంటర్లతో పాటుగా కొన్ని ప్రైవేట్ ఏజెన్సీలకు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. తెల్ల రేషన్‌కార్డులు కలిగిన కుటుంబంలోని సభ్యులందరికీ ఏడాదికి రూ.5 లక్షల వరకు ఉచితంగా చికిత్స చేయించుకునే అవకాశం ఉంటుంది. జిల్లాలో మొత్తం తెల్ల రేషన్ కార్డులు 2,66,749 కార్డులు ఉండగా వారిలో ఇప్పటి వరకు 62,161 కుటుంబాలు మాత్రమే హెల్త్ కార్డుల కోసం నమోదు చేసుకున్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులను చేయడానికి గ్రామాల వారీగా హక్కులు పొందిన ఏజెన్సీ వారు ఆధార్‌కార్డులకు ఫోన్ నంబర్ లింకు అయినవారికి ఓటీపీ ద్వారా, ఫోన్ నంబర్ లింకు లేని వారికి థంబ్ ఆధారంగా ఉచితంగా నమోదు చేసి ఫొటోలు తీసుకుని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ విధంగా లబ్ధిదారుల వద్ద ఎలాంటి రుసుం తీసుకోకుండా సేవలు అందించిన వారికి ఒక్కొక్క కార్డుకు రూ.5 చొప్పున నిర్వహకులకు చెల్లిస్తుంది. ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకున్న వారికి పోస్టల్ ద్వారా కార్డులు ఇంటికి వస్తాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవడానికి దరఖాస్తుదారు తప్పకుండా హాజరై తమ రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్లు తీసుకుని సంబంధిత ఏజెన్సీ వారి వద్ద నమోదు చేయించుకోవాల్సి ఉంటుంది. ఇందుకు భిన్నంగా ప్రైవేట్ ఏజెన్సీల వారు ప్రజాప్రతినిధులతో కుమ్మక్కై గ్రామాల్లోని పేద ప్రజల నుంచి ఉచితంగా నమోదు చేయాల్సిన చోట ఒక్కొక్క దరఖాస్తుకు రూ. 50 నుంచి రూ. 100 చొప్పున వసూలు చేస్తున్నారు. ఉచితంగా నమోదు చేసేవారికి సహకరించకుండా పలు గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు డబ్బులు వసూలు చేసేవారికి సహకరించడం కొసమెరుపు.



కొత్తగూడెంలో డబ్బులు తీసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న వ్యక్తులు

కొత్తగూడెంలో నిలదీసిన గ్రామస్తులు

సంగెం మండలంలోని కొత్తగూడెం గ్రామంలో లింగమూర్తి అనే వ్యక్తి ఏజెన్సీ ఐడీకి చెందిన దేవేందర్ అనే వ్యక్తితో పాటుగా మరో వ్యక్తి గ్రామంలో మూడు రోజులుగా రూ.50 చొప్పున డబ్బులు వసూలు చేస్తూ ఆయుష్మాన్ భారత్ కార్డుల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు చేస్తున్నారు. ఇది గమనించిన గ్రామస్తులు 'ఈ సేవలను ఉచితంగా చేయాలి, మీరు ఎందుకు డబ్బులు తీసుకుంటున్నారు' అని నిలదీయడంతో పరారయ్యారు. ఈ దందాలో ప్రజాప్రతినిధులతో పాటుగా కొంతమంది అధికారులకు సంబంధం ఉండడంతోనే ఈ నయాదందాకు పాల్పడుతున్నారని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఉచితంగా ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు పొందేవిధంగా అవగాహన కల్పించి అర్హులందరికీ హెల్త్ కార్డులు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

విచారించి ఐడీ బ్లాక్ చేస్తాం..

ఏబీహెచ్‌కార్డుల ఆన్‌లైన్ నమోదుకు ఒక్కొక్క దరఖాస్తుకు రూ.5 చొప్పున ఏజెన్సీలకు చెల్లిస్తాం. ఏజెన్సీ వారు ఉచితంగా నమోదు చేయాలి. ఈ సేవలకు ఎలాంటి రుసుం వసూలు చేయొద్దు. కొన్ని గ్రామాల్లో డబ్బులు వసూలు చేసినట్లు మా దృష్టికి వచ్చింది. విచారణ జరిపి సంబంధిత ఏజెన్సీ ఐడీని రద్దు చేస్తాం.

-విక్రమ్, ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్

హామీలు అమలు చేయాలి



పాదయాత్రలో పాల్గొన్న ఎంసీపీఐ(యూ) నాయకులు

నర్సంపేట: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నర్సంపేట డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం కోసం 2019లో శిలాఫలకం వేసి నేటికి ఇళ్ల నిర్మాణం చేపట్టకపోవడాన్ని నిరసిస్తూ ఆదివారం శిలాఫలకానికి పూల మాల వేసి కలెక్టరేట్ వరకు 12, 13 తేదీల్లో జరుగుతున్న పాదయాత్రను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల సమయంలో తప్పుడు వాగ్దానాలు చేసి ప్రచారం ఆర్భాటం చేసిందన్నారు. నర్సంపేటలో డబుల్ బెడ్ రూం నిర్మాణం కోసం సేకరించిన భూములను భూ కబ్జాదారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎవరికి తోచిన పద్ధతుల్లో వారు ఆక్రమిస్తుంటే, రెడిమిక్స్ కంపెనీకి చెందిన వారు తన కబ్జాలో పెట్టుకుంటే ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో పోరాటం చేసి భూమిని కాపాడడం జరిగిందన్నారు. వరంగల్ జిల్లాకు కలెక్టరేట్ లేదని, ఈ విషయంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గోనె కుమారస్వామి, జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, డివిజన్ కార్యదర్శి మహ్మద్ రాజాసాహెబ్, పార్టీ రాష్ట్ర నాయకులు నాగెల్లి కొమురయ్య, వంగల రాగసుధ, కనకం సంధ్య, గడ్డం నాగార్జున, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఓటు అడిగే హక్కులేదు

దుగ్గొండి: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు ఓటు అడిగే హక్కులేదని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధిని కాంక్షిస్తూ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర ఆదివారం గిర్నిబావికి చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు గోనె కుమారస్వామి, రాష్ట్ర కమిటీ సభ్యులు నాగెల్లి కొంరయ్య, వంగాల రాగసుధ, కొత్తకొండ రాజమౌళి, సింగతి మల్లికార్జున్, కందికొండ కుమారస్వామి, గటిక మమత, పేరబోయిన రమ, బుడిమె సురేందర్, పాదయాత్ర బృంద సభ్యులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం

అందరి ఆరాధ్యుడు పాపన్న

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

- వివరాలు 10లో▸

మేడారంలో భక్తుల కోలాహలం



సమ్మక్క గద్దె వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారంలో ఆదివారం భక్తుల కోలాహలం నెలకొంది. సెలవు రోజు కావడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వాహనాల్లో తరలివచ్చిన భక్తులు జంపన్నవాగు షవర్ల కింద స్నానాలు ఆచరించిన అనంతరం అమ్మవార్ల గద్దెల వద్ద పసుపు, కుంకుమ, చీర సారె, ఎత్తు బంగారం, కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గోవిందరాజు, పగిడిద్దరాజులకు పూజలు చేశారు. పూజారులు భక్తులకు గద్దెల వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మొక్కుల అనంతరం మేడారం పరిసర ప్రాంతాల్లో విడిది చేసి సహపంక్తి భోజనాలు చేశారు. భక్తుల రద్దీతో మేడారం సందడిగా కనిపించింది. సుమారు 5 వేల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు.

బీజేపీ, బీఆర్ఎస్‌లవి దొంగ నాటకాలు



యాత్రలో పాల్గొన్న గిరీష్ చోదాంకర్, నాయిని రాజేందర్ రెడ్డి, తదితరులు

- పీసీసీ గోవా మాజీ అధ్యక్షుడు గిరీష్ చోదాంకర్

హన్మకొండ: లిక్కర్ స్కాం కేసులో బీజేపీ, బీఆర్ఎస్ దొంగనాటకాలు ఆడుతున్నాయని పీసీసీ గోవా మాజీ అధ్యక్షుడు, 'హాథ్ సే హాథ్ జోడో' యాత్ర తెలంగాణ ఇన్‌చార్జ్ గిరీష్ చోదాంకర్ అన్నారు. ఆదివారం హనుమకొండలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన యాత్రను హనుమకొండ గోకుల్‌కూడలిలో నాయిని పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి ప్రారంభించారు. అశోక కాలనీ, వికాస్‌నగర్, అమరావతినగర్, టీవీ టవర్ కాలనీ, వాజిపేయి నగర్, కృష్ణా కాలని మీదుగా గోకుల్‌నగర్ పోచమ్మ దేవాలయం వరకు సాగిన యాత్ర సందర్భంగా గిరీష్ చోదాంకర్, నాయిని ప్రజలతో ముచ్చటిస్తూ సమస్యలు తెలుసుకున్నారు. నరేంద్ర మోదీ, సీఎం కేసీఆర్ పాలనా వైఫ్యాలను, రాహుల్ గాంధీ సందేశాన్ని ఇంటింటికీ వివరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా గిరీష్ చోదాంకర్ మాట్లాడుతూ లిక్కర్ స్కాం నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి కల్వకుంట్ల కవిత మహిళా రిజర్వేషన్ బిల్లు అంశాన్ని ముందుకు తెచ్చిందని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు దేశ ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు చేయలేదని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ అదానీ, అంబానీలకు కట్టబెడుతోందని ధ్వజమెత్తారు. నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన పథకాలను బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చాక నిర్వీర్యం చేసిందన్నారు. తెలంగాణ వస్తే ప్రజల బతుకులు మారుతాయని, బాధలు పోతాయని నమ్మితే కేసీఆర్ చేసింది ఏమీ లేదని విమర్శించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణాలో నిరుద్యోగుల చావులు, రైతుల ఆత్మహత్యలు, సామాన్య ప్రజల నెత్తిపై అప్పులు తప్ప ఎలాంటి ప్రయోజనాలు లేవని దుయ్యబట్టారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బంక సతీష్‌యాదవ్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ, నాయకులు నసీం జహాన్, బంక సంపత్ యాదవ్, లలిత, బి.భాగ్యలక్ష్మి, చాముండేశ్వరి, విజయ, బొంత సుజాత, బొల్లు కిషన్, మురళి, రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మరో వివాదంలో కార్పొరేటర్..

- పార్కింగ్ కోసం స్మార్ట్‌సిటీ పనులు . ధ్వంసం చేసిన శ్రీనివాస్
- అడ్డుకున్న స్థానిక కార్పొరేటర్ భర్త కిషన్



జేసీబీతో ధ్వంసం చేసిన స్మార్ట్ సిటీ పనులు

హన్మకొండ అర్బన్ : ఇప్పటికే ఓ స్థలం విషయంలో యజమానిని బెదిరించారనే ఆరోపణలతో జైలుకెళ్లి వచ్చిన కార్పొరేటర్ వేముల శ్రీనివాస్ మరో వివాదంలో చిక్కుకున్నాడు. 30వ డివిజన్ పరిధిలోని హన్మకొండ బస్టాండ్ సమీపంలో కుడాకు సంబంధించి కొత్త కాంప్లెక్స్ లీజ్‌కు తీసుకున్నాడు. ఈ కాంప్లెక్స్‌కు సంబంధించి ప్రస్తుతం అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో కాంప్లెక్స్ ముందు స్మార్ట్ సిటీపనుల్లో భాగంగా గ్రేటర్ మున్సిపాలిటీ వారు నిర్మించిన డ్రెయినేజీ నిర్మాణాన్ని పూర్తిగా ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ భర్త రావుల కిషన్ పనులు అడ్డుకున్నాడు. స్మార్ట్‌సిటీ పనులు ఎలా ధ్వంసం చేస్తారంటూ మండిపడ్డారు. పనులు చేస్తున్న జేసీబీని స్వాధీనం చేసుకుని వేరేచోటుకు పంపించారు. ఈ విషయంలో అధికారులకు ఫిర్యాదు చేస్తామని కిషన్ తెలిపారు. తన కాంప్లెక్స్ ముందు నిబంధనలకు విరుద్ధంగా రోడ్డును పార్కింగ్ కోసం వినియోగించడానికి కార్పొరేటర్ శ్రీనివాస్ స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులు పనులు ధ్వంసం చేస్తున్నారని కిషన్ ఆరోపించారు. దీనిపై యంత్రాంగం స్పందించాలన్నారు. యథావిధిగా నిర్మాణం చేయాలని లేదంటే ఆందోళనకు దిగుతామన్నారు హెచ్చరించారు. ప్రస్తుతం పనుల వల్ల రానున్న రోజుల్లో రోడ్డు మొత్తం పార్కింగ్ కోసం వాడుకునే ప్లాన్ ఉందన్నారు. దీంతో బస్టాండ్ ప్రధాన కూడలిలో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతుందని అన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పుచ్చకు 'పురుగు'ల బెడద

- తెగుళ్లతోనూ తిప్పలే
- సస్యరక్షణ చర్యలు తీసుకుంటే మేలు : శాస్త్రవేత్తలు



పుచ్చకాయను ఆశిస్తున్న పురుగులు





తెగుళ్లతో దెబ్బతిన్న పుచ్చకాయ

కరీమాబాద్: ఎంతో ఆశతో రైతులు సాగు చేస్తున్న పుచ్చ పంటకు పురుగుల బెడద పీడిస్తోంది. కాపు ద శకు వచ్చిన సమయంలో వివిధ రకాల పురుగులు, తెగుళ్లు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేస్తున్న పంట దెబ్బతింటుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే సస్యరక్షణ చర్యలు తీసుకుంటే ఎలాంటి సమస్యలు రాకుండా అధిక దిగుబడి సాధించవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

పండు ఈగ.. నివారణ

పండు ఈగ పురుగులు పూత దశలో ఆశిస్తూ పువ్వులపై గుడ్లు పెట్టడమే కాకుండా పూత, మొగ్గల్లోకి చేరి నష్టం చేస్తాయి. అయితే వాటి నివారణకు మలాథియాన్ మందు పిచికారీ చేయడమే కాకుండా ఎకరానికి 2 లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేయడంతోపాటు కుళ్లిన కాయలు తీసేయాలి.



పెంక పురుగులు.. నివారణ

ఈ పురుగులు ఆకులపై రంధ్రాలు చేస్తాయి. తీగ పాకే సమయంలో ఆకుల మీద ఎక్కువ నష్టం చేస్తాయి. పెంక పురుగు నివారణ కోసం ట్రైకోఫోరాన్ పొడిని గానీ మందును గానీ మోతాదు ప్రకారం పిచికారీ చేయాలి.

గొంగళి పురుగు.. నివారణ

ఈ రకం పురుగులు పంటపై అన్ని దశల్లోనూ ఆశిస్తాయి. ఆకులను తిని పత్రాలను నష్టపరుస్తాయి. దీంతో మొక్క ఎదగకపోవడమే కాకుండా దిగుబడిపై ప్రభావం పడుతుంది. అయితే వాటి నివారణకు థయోడికార్బ్, క్లోరోపైరిఫాస్ మందులను మొతాదు ప్రకారం పిచికారీ చేయాలి.

నులి పురుగులు.. నివారణ

ఈ పురుగులు మొక్క వేరు దిగువ భాగంలో చేరి బొడిపెలుగా మార్చి నష్టం చేస్తాయి. దీంతో మొక్కలు చనిపోతాయి. వాటి నివారణ కోసం కార్బోసల్ఫాన్‌తో విత్తన శుద్ధి చేసుకోవాలి. మొక్క మొదలు దగ్గర వేప పిండి వేయాలి.

బూడిద తెగులు.. నివారణ

వాతావరణంలో మార్పులతోపాటు రాత్రి చల్లగా.. పగలు వేడిగా ఉన్నప్పుడు ఈ తెగుళ్ల ఉధృతి బాగా ఉంటుంది. పూత దశలో ఎక్కువగా ఆశిస్తుంది. మొదట లేత ఆకులపై బూజు లాంటి పదార్థంగా ఏర్పడుతుంది. తర్వాత పూత, కాండం పైన, పూల మీద, చిన్న పిందెల మీద తెల్లని బూజు వస్తుంది. దీంతో పూత, కాత రాలిపోతుంది. ఈ రకం తెగుళ్ల నివారణ కోసం మానకోజెబ్, హెక్సాకోనాజోల్, ప్రొపికోనజోల్ వంటి మందులు మోతాదు ప్రకారం పిచికారీ చేయాలి.

బూజు తెగులు.. నివారణ

ఈ తెగులు ఆశించినప్పుడు మొదట్లో ఆకుల మీద ఆకుపచ్చ, ముదురు ఆకుపచ్చ కలిసినటువంటి మచ్చలు కనిపిస్తాయి. తర్వాత ఆకులపై పసుపు రంగు మచ్చలు ఏర్పడి ఆకులు ఎండిపోయి రాలిపోతాయి. దీని నివారణ కోసం మెటలాక్సిల్, మాన్‌కోజెబ్ మందులు పిచికారీ చేయాలి.

పక్షి కన్ను తెగులు.. నివారణ

ఆకులు, కాయల మీద పక్షి కన్ను వంటి గుండ్రటి మచ్చలు ఏర్పడతాయి. ఆ భాగంలో ఆకులు ఎండిపోయి రాలిపోతుంటాయి. నివారణ కోసం కాపర్ ఆక్సీక్లోరైడ్, కార్బండిజం, మాన్‌కోజెబ్ లాంటి మందులు పిచికారీ చేయాలి.

వెర్రి తెగులు.. నివారణ

ఈ తెగులు ఆశించిన ఆకులు మధ్య మందంగా చారలుగా ఏర్పడి పాలుసుగా మారుతాయి. దీంతో పూత, పిందె ఏర్పడడం ఆగిపోతుంది. దీని నివారణ కోసం మొక్కలను పీకి కాల్చేయాలి. అంతేకాకుండా డైమెథోయేట్, మిథియాల్ డెమిటియన్ వంటి మందులు పిచికారీ చేయాలి.

సస్యరక్షణ పద్ధతులు పాటించాలి



ఎండాకాలంలో సాగు చేసే పుచ్చ పంటలో రైతులు సస్యరక్షణ పద్ధతులు పాటించాలి. లోతుగా దుక్కి దున్నడంతోపాటు విత్తన శుద్ధి చేయాలి. భూములను, ప్రాంతాలను బట్టి తట్టుకునే శక్తి ఉన్న విత్తనాలను ఎంపిక చేసుకోవాలి. మొక్క దశ నుంచే జాగ్రత్తలు తీసుకోవాలి. పురుగులు, తెగుళ్ల వ్యాప్తి చెందకుండా మందులను పిచికారీ చేయాలి.

\- డాక్టర్ రాజు, శాస్త్రవేత్త, కేవీకే మామునూరు

నాలుగు నెలలకే నూరేళ్లు నిండాయి..

- ఇంజక్షన్ వికటించి బాలుడి మృతి
- ఆర్‌ఎంపీపై కేసు నమోదు



బాలుడి మృతదేహం



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కేసముద్రం: ఓ ఆర్‌ఎంపీ వైద్యుడు ఇచ్చిన ఇంజక్షన్ వికటించి నాలుగు నెలల బాలుడు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం రంగాపురంలో చోటు చేసుకుంది. ఎస్సై రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన భుక్యా వీరన్న–మహేశ్వరి దంపతులకు ఇద్దరు కుమారులు. రెండో కుమారుడికి (4 నెలల వయస్సు) కొద్ది రోజులుగా జ్వరం, విరేచనాలతో బాధపడుతున్నాడు. స్థానిక ఆర్‌ఎంపీ వైద్యుడు భుక్యా హాలును బాలుడి తల్లిదండ్రులు సంప్రదించగా శనివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో బాలుడికి ఇంజక్షన్ ఇచ్చాడు. కొంత సమయం తర్వాత ఆ బాలుడి ఆరోగ్య పరిస్థితి విషమించి అపస్మారక స్థితికి చేరడంతో వెంటనే మానుకోటలోని ఓ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు సూచన మేరకు అక్కడి నుంచి ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆ బాలుడు ఆదివారం తెల్లవారుజామున ఒంటిగంటకు మృతి చెందాడు. ఆర్‌ఎంపీ వైద్యుడు ఇచ్చిన ఇంజక్షన్ వికటించడంతోనే మా కొడుకు మృతి చెందాడంటూ తల్లిదండ్రులు ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఆర్‌ఎంపీ వైద్యుడు హాలుపై కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం బాలుడి మృతదేహాన్ని మానుకోట ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

తల్లిదండ్రులు రోదించిన తీరు కలచివేసింది..

బోసినవ్వులతో ఇంటిల్లిపాదిని ఆనందంలో ముంచెత్తి... మురిపించే బాలుడు కానరానిలోకాలకు వెళ్లడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతి చెందిన బాలుడికి ఇంకా నామకరణం చేయలేదు. ముద్దుగా పండు అంటూ పిలుచుకుంటున్న ఆ తల్లిదండ్రులు కొడుకు జ్ఞాపకాలను తలుచుకుంటూ, పండు లేవరా అంటూ రోదించిన తీరు అందరి హృదయాలను కలచివేసింది.

టైర్లను దొంగిలిస్తున్న ముఠా అరెస్ట్



నిందితులను, స్వాధీనం చేసుకున్న టైర్లను చూపుతున్న ఏసీపీ శివరామయ్య

ఆత్మకూరు: రాత్రి సమయంలో వరంగల్–ములుగు జాతీయ రహదారిపై పార్క్ చేసిన లారీలు, టిప్పర్ల టైర్లను దొంగిలిస్తున్న ముఠాను స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఏసీపీ శివరామయ్య కథనం ప్రకారం.. ఈ మధ్య కాలంలో ఆత్మకూరు శివారుతో పాటు పలు ప్రాంతాల్లో 30 లారీ, టిప్పర్ టైర్లను పార్కు చేసిన సమయంలో దొంగిలించారు. ఈ దొంగతనాలకు పాల్పడిన ముఠాను ఆత్మకూరు పోలీసులు ఛేదించారు. మణుగూరుకు చెందిన వల్లెపు వెంకటేశ్వర్లు, మక్కల్ల ఐలయ్య, మక్కల్ల కుమార్, తమ్మనపుడి సత్యనారాయణ, వల్లెపు వెంకన్నలు, అలాగే వీరి వద్ద టైర్లను కొనుగోలు చేసిన విజయవాడకు చెందిన షేక్ ఖాజాలను పోలీసులు గుర్తించారు. నిందితులను పట్టుకొని అరెస్టు చేయగా మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. వీరి నుంచి సుమారు రూ.3.60 లక్షల విలువ చేసే 30 టైర్లు , అశోక్ లేలాండ్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. దొంగలను పట్టుకున్న సీఐ బీ.కుమార్, ఎస్సై ప్రసాద్, సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

వ్యాపారులకు రూ.13 లక్షల టోకరా

కాజీపేట: తీయతీయని మాటలతో వ్యాపారులకు రూ.13 లక్షలకు పైగా కుచ్చుటోపీ పెట్టి ఓ మోసగాడు పరారైన ఘటనపై కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదు చేశారు. సీఐ గట్ల మహేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఫాతిమానగర్‌లో అమర్ దీప్ ట్రేడింగ్ అండ్ కో షాపు నిర్వహిస్తున్న దినేష్ పలు షాపులు తిరుగుతూ అడ్వాన్స్‌గా చెక్కులు ఇస్తూ పైపులు, ఎలక్ట్రికల్ వస్తువులను కొనుగోలు చేస్తూ వ్యాపారులను నమ్మించాడు. సామానులు కొనుగోలు చేసి అడ్వాన్స్‌గా చెక్కులు అందించి దినేష్ పరారయ్యాడు. ఫాతిమానగర్‌లోని షాపు వద్దకు బాధిత వ్యాపారులు వెళ్లి చూడగా దుకాణాన్ని ఎప్పుడో మూసేసి సామానుతో పరారైనట్లు తెలిసింది. బాధితులు మోసపోయినట్లుగా గుర్తించి కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా దినేష్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే రాజయ్య తీరుపై చర్చ

- సర్పంచ్ నవ్యపై వేధింపులతో మరోసారి తెరపైకి
- ప్రగతిభవన్‌ను తాకిన లైగింక వేధింపుల ఆరోపణలు
- మహిళా కమిషన్ సీరియస్.. సుమోటోగా స్వీకరణ
- విచారణకు డీజీపీకి ఆదేశాలు

Telangana State Commissio... · 14h
@SCWTelangana has taken cognizance of the matter. Chairperson @sunitavakiti has already written to @TelanganaDGP to personally intervene in the matter. @TelanganaToday @ntdailyonline

విచారణ చేపట్టాలని మహిళా కమిషన్ డీజీపీకి పంపించిన మెసేజ్

జనగామ: మహిళా సర్పంచ్‌పై లైగింక వేధింపుల ఆరోపణలతో ఎమ్మెల్యే రాజయ్య వ్యవహారం మరోసారి రాష్ట్ర వ్యాప్తంగా సంచలనమైంది. సోషల్ మీడియాలో నెటిజన్లు ఎమ్మెల్యే సార్‌ను ఓ ఆటా ఆడేసుకుంటున్నారు. గౌరవ ప్రదమైన హోదాలో ఉన్న ఎమ్మెల్యే.. మహిళలకు సంబంధించి తరుచూ ఏదో ఒక వివాదంలో ఇరుక్కుంటూనే ఉన్నాడు. ఎమ్మెల్యే రాజయ్య తనను లైగింకంగా వేధిస్తున్నాడని హనుమకొండ/జనగామ జిల్లా పరిధి స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం ధర్మసాగర్ మండలం జానకీపురం సర్పంచ్ కుర్సపల్లి నవ్య ఆరోపించడంతో మూడు రోజులుగా చర్చనీయాంశంగా మారింది. అధికార పార్టీతో సహా అన్ని వర్గాల నుంచి ఆగ్రహం పెల్లుబికడంతో నిరసన సెగ ప్రగతిభవన్‌ను తాకింది. పార్టీ వర్గాలు ఓపైపు ఆరా తీస్తుండగానే.. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఈ కేసును సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టాలని డీజీపీని ఆదేశించింది.

ఎమ్మెల్యే ఎప్పుడూ వివాదమే..!

గత అసెంబ్లీ ఎన్నికల నుంచి ఎమ్మెల్యే రాజయ్య మహిళలకు సంబంధించిన ఏదో ఒక వివాదంలో తెరపైన కనిపిస్తూనే ఉన్నాడు. తెలంగాణ తొలి ఉపముఖ్యమంత్రిగా పనిచేసిన ఆయనను కేబినెట్ నుంచి ఏకంగా బర్తరఫ్ చేయడం అప్పట్లో హాట్‌టాపిక్‌గా మారింది. దానిపై అనేక ముచ్చట్లు సైతం వినిపించాయి. ఇదిలా ఉంటే.. గతంలో వేలేరు మండలంలోని ఓ ఊరికి చెందిన మహిళతో ఫోన్‌లో అసభ్యకరంగా.. శవ్వ, శవ్వ అంటూ ఎమ్మెల్యే రాజయ్య మాట్లాడిన మాటలుగా.. ఆడియో రికార్డు ఆ రోజుల్లో పెద్ద చర్చనీయాంశం కాగా.. అది తన వాయిస్ కాదని రాజయ్య కొట్టిపారేశారు. ఆ తర్వాత లింగాలఘణపురంలో జరిగిన ఓ జన్మదిన వేడుకల్లో సైతం ఎమ్మెల్యే చిలిపి చేష్టలు.. ఆన్‌లైన్‌లో హల్‌చల్ చేశాయి. ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో జిల్లాలో లక్ష మందికి పైగా పిల్లలు తన వల్లనే పుట్టారని వివాదాస్పద వ్యాఖ్యలు సైతం విమర్శలను ఎదుర్కొనేలా చేసింది. అలాగే లింగాలఘణపురం మండలంలో బతుకమ్మ చీరల పంపిణీలో సీఎం కేసీఆర్ అందరికీ భర్త లాంటివాడని నోరుజారీ.. సరిచేసుకునే ప్రయత్నం చేశాడు. తాజాగా జానకీపురం సర్పంచ్ నవ్య ఎమ్మెల్యే తనను లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడని ఆరోపించడంతో ఎమ్మెల్యేకు అధిష్టానం నుంచి మొట్టికాయలు వేసే వరకు దారి తీసింది.

మహిళా కమిషన్ ఆదేశం..పోలీసుల విచారణ

ఎమ్మెల్యే రాజయ్య తనను లైంగికంగా వేధింపులకు గురి చేస్తున్నాడని సర్పంచ్ నవ్య ఆరోపణల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీత స్పందించారు. కేసును సుమోటోగా తీసుకుని.. విచారణకు డీజీపీని ఆదేశించారు. దీంతో పరిస్థితి చేయిదాటి పోయే ప్రమాదం ఉందని గ్రహించిన ఎమ్మెల్యే.. పార్టీ పెద్దల సూచనలు పాటిస్తూ.. ఆదివారం జానకీపురంలోని సర్పంచ్ నవ్య ఇంటికి వెళ్లారు. సర్పంచ్ దంపతులతో కలిసి ఎమ్మెల్యే మీడియా ముందుకు వచ్చారు. ప్రొటోకాల్ విషయంలో ఎక్కడైనా ఇబ్బంది కలిగితే.. మహిళా లోకం తనను క్షమించాలని కోరగా.. నవ్య పార్టీ ఆదేశాల మేరకు నడుచుకుంటానని చెబుతూనే.. ఎమ్మెల్యేకు పరోక్షంగా హెచ్చరికలను జారీ చేసింది. వేధింపులకు గురిచేసిన వారు ఎంతటి స్థాయిలో ఉన్నా ఊరుకునేది లేదని స్పష్టం చేసింది. ఎమ్మెల్యే సర్పంచ్ ఇంటికి వెళ్లడంతో నాలుగు రోజుల వివాదానికి తెరపడగా.. మహిళా కమిషన్ విచారణకు ఎమ్మెల్యే హాజరు కావాల్సి ఉంటుందా లేదా అనే విషయం తేలాల్సి ఉంది. ఇందుకు సంబంధించి సర్పంచ్ చేసిన ఆరోపణల నేపథ్యంలో ఎమ్మెల్యే వ్యవహారంపై ఇంటలిజన్స్ వర్గాలు ప్రభుత్వానికి నివేదిక అందించినట్లు సమాచారం. ఈ విషయమై సీఎంతోపాటు మంత్రి కేటీఆర్ సీరియస్ అయినట్లు తెలిసింది.

ఐదుగురిపై అట్రాసిటి కేసు

- విచారణ చేపట్టిన డీఎస్పీ

టేకుమట్ల : మొగుళ్లపల్లి మండలంలోని ఆకినపల్లికి చెందిన ఓ దళిత యువతిని ఇటీవల మండల కేంద్రంలో కులంపేరుతో పాటు, అసభ్య పదజాలంతో దూషిస్తూ మానసికంగా ఇబ్బందులకు గురి చేసిన ఐదుగురిపై శనివారం సాయంత్రం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఎస్సై చల్ల రాజు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. దళిత మహిళ ప్రేమ విషయమై మండల కేంద్రానికి చెందిన వంశీ అడిగేందుకు వచ్చిన యువతిని కులం పేరుతో దూషించడంతో పాటు మానసికంగా తీవ్ర ఇబ్బందులకు గురి చేసినట్లు తెలిపారు. శనివారం బాధిత యువతి ఫిర్యాదు మేరకు మండల కేంద్రానికి చెందిన బొల్లు రమణారెడ్డి, బొల్లు విజయ, బొల్లు వసంత, బొల్లు నాగరాజు, బొల్లు మాధవరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

డీఎస్పీ విచారణ

శనివారం మండల కేంద్రానికి చెందిన ఐదుగురిపై అట్రాసిటీ కేసు నమోదుపై ఆదివారం భూపాలపల్లి డీఎస్పీ రాములు మండల కేంద్రంలో విచారణ చేపట్టారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు వివరాలను త్వరలో వెల్లడిస్తామని తెలిపారు.

వైన్‌షాప్ సీజ్



టేకుమట్ల : అధిక ధరలకు మద్యం విక్రయిస్తుండగా పట్టుకుని వైన్‌షాప్‌ను సీజ్ చేసినట్లు రాష్ట్ర ఎక్సైజ్ డీఎస్పీ వెంకటరాం రెడ్డి ఆదివారం తెలిపారు. మండలంలోని వెలిశాలలో ఏర్పాటు చేసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి వైన్‌షాప్‌ను ఇటీవలే నిబంధనలకు విరుద్ధంగా మండల కేంద్రానికి తరలించి మద్యాన్ని బెల్టుషాపులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారని తెలిపారు. అధిక ధరలకు విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు అకస్మిక దాడులు నిర్వహించగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడినట్లు తెలిపారు. అధిక ధరల విక్రయానికి రూ.3 లక్షల జరిమానాతో పాటు వైన్‌షాప్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమించి విక్రయిస్తే కేసులు నమోదు చేసి షాప్ సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



మృతదేహంపై పడి రోదిస్తున్న భార్య రజిత

టేకుమట్ల(రేగొండ): ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని కనిపర్తిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రేగొండ మండలంలోని కనిపర్తికి చెందిన పడకంటి రాజు(45) తన కూతురు రమ్య ఆరోగ్యం సరిగా లేకపోవడంతో అప్పులు చేసి వైద్యం చేయించాడు. అయినా ఆరోగ్యం మెరుగుపడక పోగా, ఆమె వైద్యం కోసం చేసిన అప్పులు పెరిగి తీవ్రమనస్థాపానికి గురై ఆదివారం తన వ్యవసాయ పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

పెరిక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ వర్మ



సమావేశంలో మాట్లాడుతున్న పెరిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్‌వర్మ

నెహ్రూసెంటర్ : పెరికల అభివృద్ధికి, సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని పెరిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్కరసు ప్రభాకర్ వర్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా స్థాయి సర్వసభ్య సమావేశం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండా రాజశేఖర్ అధ్యక్షతన జిల్లాకేంద్రంలోని బాలాజీ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించారు. జిల్లా కేంద్రంలో పెరిక కులస్తులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ వర్మ మాట్లాడుతూ పెరిక వర్గీయులంతా ఐకమత్యంగా ఉంటూ సంఘ అభివృద్ధి, సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. పెరికలను బీసీ 'బీ' నుంచి 'ఏ'లోకి మార్చాలన్నారు. త్వరలోనే హైదరాబాద్‌లో పెరిక కులస్తుల మహాగర్జన నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం మహబూబాబాద్ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా గుండా నాగేశ్వర్‌రావు, అధ్యక్షుడిగా బందు సైదులు, ఉపాధ్యక్షులుగా అవిరే మోహన్‌రావు, ప్రధానకార్యదర్శిగా అచ్చ శ్రీనివాస్, కోశాధికారిగా నల్లపు వీరన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు ధాన్యకుల కృష్ణ, సుధాకర్, మోహన్‌రావు, భానుప్రకాష్, వీరన్న, జనార్దన్, శ్రీనివాస్, విజయ్‌కుమార్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మిల్లు స్థలంలోనే కార్మికులకు ప్లాట్లు కేటాయించాలి

- ఎంవీఆర్‌ఎస్ యూనియన్ నాయకుల డిమాండ్



నినాదాలు చేస్తున్న ఎంవీఆర్‌ఎస్ నాయకులు

కాశిబుగ్గ : ఆజంజాహి మిల్లు స్థలంలోనే కార్మికులకు ప్లాట్లు కేటాయించాలని ఆజంజాహి మిల్లు మాడిఫైడ్ వలంటరీ రిటైర్‌మెంట్ సంఘం (ఎంవీఆర్‌ఎస్)లోని 318 మంది కార్మికులు డిమాండ్ చేశారు. ఆదివారం భగత్‌సింగ్‌నగర్‌లోని యూనియన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు, హైకోర్టు కార్మికులకు మిల్లు స్థలంలోనే ఇండ్ల స్థలాలు కేటాయించాలని తీర్పు ఇచ్చాయని తెలిపారు. కానీ ఇక్కడ అధికారులు మాత్రం మిల్లు స్థలంలో ఇవ్వకుండా అనంతసాగర్, మడిపెల్లిలో కేటాయిస్తామంటూ తీసుకోవాలని మాపై ఒత్తిడి తీసుకొస్తున్నారన్నారు. మాకు సరిపోయే మిల్లు భూమి ఉన్నప్పటికీ అక్కడ స్థలాలు ఇవ్వడంలో ఆంతర్యం ఏమిటో అర్థంకావడం లేదన్నారు. ఎంవీఆర్‌ఎస్ యూనియన్ సభ్యులు బి.రామ్మూర్తి, ఓంప్రకాశ్, యశోద, శంకర్, సందీప్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గూడూరు : మండలంలోని మచ్చర్లకు చెందిన ఓ వ్యక్తి కుటుంబాన్ని పోషించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూక్య సాంబయ్య (40) భార్య శిరోమణితో కలిసి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. గత కొంత కాలంగా కుటుంబ ఆర్థిక పరిస్థితులు సరిగా లేకపోవడంతో పోషించలేకపోతున్నాననే బెంగతో ఆవేదన చెందుతున్నాడు. ఆ బాధతో సాంబయ్య ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య శిరోమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై దిలీప్ తెలిపారు.